

నేడు శంబరకు చినపోలమాంబ

మక్కువ, జనవరి 7 : ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో ప్రధాన ఘట్టానికి సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి చినపోలమాంబను గ్రామంలోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మేళతాళాల మధ్య భక్తిశ్రద్ధలతో అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించనున్నారు. ఈ సందర్భంగా చినపోలమాంబకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. కాగా ఈ నెల 22, 23, 24 తేదీల్లో ప్రధాన జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి దేవదాయ సిబ్బంది సన్నద్ధమవుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

నిరసనాగ్రహం

- ఎస్మాపై అంగన్‌వాడీలు భగ్గు
- జిల్లావ్యాప్తంగా జీవో కాపీల దహనం
- సర్కారు తీరుపై మండిపాటు
- వెనక్కి తగ్గేదే లేదని వెల్లడి

పార్వతీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) / బెలగాం/ సాలూరు/ గరుగుబిల్లి/ సీతంపేట : ఎస్మాపై అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. సర్కారు తీరుపై మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత 27 రోజులుగా సమ్మె చేస్తుంటే.. జీవో నెంబరు 2 విడుదల చేయడమేమిటని ప్రశ్నించారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా.. తమ హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కారు తీరును ఖండిస్తూ.. ఈ మేరకు ఆదివారం జిల్లావ్యాప్తంగా జీవో కాపీలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీలు నిరసన దీక్ష కొనసాగించారు. ఈ 24 గంటల నిరవధిక దీక్షలో భద్రగిరి, బలిజిపేట మండలాల సెక్టార్ల అంగన్‌వాడీలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్ని ఎస్మాలను ప్రయోగించినా వెనక్కి తగ్గేది లేదని వెల్లడించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీల సంఘం నాయకులు స్పష్టం చేశారు. తమ డిమాండ్లపై స్పందించకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. సాలూరు, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, సీతంపేట, సీతానగరం తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీలు జీవో నెంబరు 2 కాపీలను దహనం చేశారు. ప్రభుత్వ తీరును ఖండించారు. ఎస్మాను రద్దు చేయాలని నినదించారు. సర్కారు చర్యలకు తాము భయపడేది లేదని వారు స్పష్టం చేశారు.



సాలూరులో జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



సీతంపేటలో..



గరుగుబిల్లిలో..



పార్వతీపురం నిరసన దీక్ష శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం



సీతానగరంలో..

పోరుబాటలోనే..

- వినూత్నంగా పారిశుధ్య కార్మికుల ఆందోళనలు
- సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు



సాలూరులో సర్వమత ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



పాలకొండలో...

పార్వతీపురంటౌన్/సాలూరు/పాలకొండ, జనవరి 7 : సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురంలో వారు ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి పాతబస్టాండ్ కూడలిలో రాస్తా రోకో, మానవహారం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాలూరులోని బోసుబొమ్మ కూడలిలో మున్సిపల్ కార్మికులు సర్వమత ప్రార్థనలు, మానవహారం నిర్వహించారు. పాలకొండలోని చెక్‌పోస్టు సెంటర్‌లో పారిశుధ్య కార్మికులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.



పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న మున్సిపల్ కార్మికులు



జిల్లా కేంద్రంలో పరిస్థితి ఇదీ..

ఎక్కడి చెత్త అక్కడే..

పార్వతీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీలతో పాటు పాలకొండ నగర పంచాయతీలోనూ కొద్ది రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెగ్యులర్ కార్మికులతో పనులు చేయిస్తున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడికక్కడే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఎక్కడ చూసినా మురుగుతో నిండిన కాలువలే కనిపిస్తున్నాయి. చెత్త, వ్యర్థాల సమస్య వేధిస్తోంది. పల్లెల్లో కాలువలన్నీ పూడికలతో నిండిపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. దుర్వాసన వెలువడడంతో ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. మొత్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. మరోవైపు ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే పరిస్థితి ఇంకా దిగజారకముందే సర్కారు స్పందించాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపసంహరించాల్సిందే..

- 'న్యాయ సంహిత'పై మోటారు కార్మికుల డిమాండ్
- సాలూరు హైవేపై రాస్తారోకో

సాలూరు రూరల్, జనవరి 7: భారత న్యాయ సంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని మోటారు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని 26వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన భారత న్యాయ సంహిత చట్టం వల్ల ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని మోటారు కార్మికులు తెలిపారు. ఈ చట్టంలో హిట్ అండ్ రన్‌కు సంబంధించిన సెక్షన్ 109/2 మరింత కఠినంగా ఉందని చెప్పారు. ఈ సెక్షన్ వల్ల వాహన చోదకులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. తక్షణమే దీనిపై కేంద్ర సర్కారు పునరాలోచించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం సాలూరు సీఐ జి.దేవుడుబాబు అక్కడకు చేరుకుని చర్చించడంతో వారు ఆందోళన విరమించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నేత సిద్ధాబతుల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



హైవేపై రాస్తారోకో చేస్తున్న మోటారు కార్మికులు

సర్కారు స్పందించాలి

- జిల్లాకేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళన

బెలగాం, జనవరి 7: తమ సమస్యలపై వైసీపీ ప్రభుత్వం స్పందించాలని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ ఎదుట శిబిరం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నా.. సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. చిరుద్యోగులపై నిర్లక్ష్యం తగదన్నారు. నోటీసులు ఇచ్చి కక్షపూరితంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విధుల నుంచి తొలగిస్తామని బెదిరించినా భయపడేది లేదని వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్కారు స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఇదిలా ఉండగా యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్టీయూ నాయకులు మురళీ మోహనరావు, ఎన్.బాలకృష్ణారావు, కాగాన విజయ్ తదితరులు దీక్ష శిబిరానికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం వైసీపీ సర్కారు తీరును తప్పుబట్టారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల గోడును పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సర్కారుకు చిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా బెదిరింపు చర్యలకు దిగడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన శిబిరంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కుష్ఠుపై కంగారొద్దు

- జిల్లాలో అనుమానిత కేసులు 1084
- ప్రస్తుతం తేలినవి 183 కేసులు
- ఆందోళన వద్దంటున్న వైద్య నిపుణులు
- త్వరగా చికిత్స పొందాలని సూచన

జియ్యమ్మవలస

జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ముమ్మర సర్వే జరుగుతోంది. ఇప్పటివరకు సుమారు 8,39,688 కుటుంబాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో 1084 అనుమానిత కేసులు ఉన్నట్లు తేల్చారు. ఇందులో పాసీ బ్యాసిలర్ (పీబీ) కేసులు 34, మల్టీ బ్యాసిలర్ (ఎంబీ) కేసులు 24, పిల్లల్లో పీబీ కేసులు 4, ఎంబీ కేసులు ఒకటిగా గుర్తించారు. ఇవన్నీ సర్వేల్లోనే గుర్తించారు. ఇదికాకుండా జిల్లా ఆసుపత్రిలో ఇద్దరికి, పాలకొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరికి శస్త్రచికిత్సలు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే జిల్లాలో గరుగుబిల్లి, బలిజిపేట, పాలకొండ మండలాల్లో ఎక్కువగా ఎనిమిది కేసులు, సీతంపేట, వీరఘట్టాం మండలాల్లో ఏడు కేసుల చొప్పున ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవికాకుండా 2022 ఏప్రిల్ 1 నుంచి ఇంత వరకు ఆసుపత్రులకు వచ్చిన వారిలో 122 మందికి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. వీరిలో పీబీ కేసులు 72, ఎంబీ కేసులు 50గా ఉన్నాయి. కాళ్లు, చేతులు వంకర అయ్యే రోగి ఒకరు ఉన్నట్లు తేలింది. 2022 డిసెంబరు వరకు 54 మంది పూర్తిగా కోలుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.



అలమండ పంచాయతీ చినతోలుమండగూడలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఇవీ లక్షణాలు..

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- చెవులపై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు
- కనురెప్పలు మూతపడకపోవడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం
- చల్లని, వేడి గల వస్తువులను గుర్తించలేకపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- మందమైన మెరిసే జిడ్డు గల చర్మం (చర్మం ఉబ్బెత్తుగా) బత్తాయి తొక్కలా ఉండటం
- కనుబొమ్మలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- అర చేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం.

నివారణ చర్యలు ఇలా..

- కుష్ఠు వ్యాధి నివారణ చేయడానికి కచ్చితంగా దగ్గర్లో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాల్సి ఉంది. ఈ సమస్యకు వివిధ యాంటీ బయాటిక్స్ కలయికతో చికిత్స చేయవచ్చు.
- తిమ్మిరిని ఎదుర్కొనడానికి, పాదాలను రక్షించడం, సాధారణ నడకను పునరుద్ధరించుకోవడానికి సహాయపడే ప్రత్యేక బూట్లను ఎంచుకోవాలి.
- పైన కనిపించే వైకల్యాలను సరిచేయడానికి సర్జరీ పూర్తిగా సహాయపడుతుంది.
- ఏడాది కాలంలో చికిత్స చేయవచ్చు. అందుకే వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం.
- సరైన, సకాల చికిత్స. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయగలదు.

నివారణే లక్ష్యం..

కుష్ఠు వ్యాధిపై ఎక్కువగా ఆందోళన చెందొద్దు. ఎటువంటి లక్షణాలు కనిపించినా వెంటనే సమీప పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించి తగు చికిత్స అందేలా చూసుకోవాలి. పూర్తి నివారణే మా లక్ష్యం. **-ఎ.శ్యామ్‌కుమార్, కుష్ఠు వ్యాధి నిర్మూలనాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా**



సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తున్న జిల్లా కుష్ఠు వ్యాధి నిర్మూలనాధికారి శ్యామ్‌కుమార్ (ఫైల్)

వైసీపీకి చరమగీతం పలకాలి

● పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ



సీతంపేట: మానాపురంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిస్తున్న నిమ్మక జయకృష్ణ

సీతంపేట:రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పలకాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ కోరారు.ఆదివారం మానాపురం పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు దగా పడ్డారన్నారు. యువత మద్దతు టీడీపీకే పూర్తిస్థాయిలో ఉందని ఆ దిశగా 2024 ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధిస్తుందని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సవర తోట ముఖలింగం, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి మండంగి ప్రకాశం, బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.రంగనాథం, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐ-టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ హిమరిక పవన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంట సుధ, మూటక భరత్‌రాజ్, నిమ్మక కృష్ణ, మండంగి కుమార్, బిడ్డిక విశ్వనాథం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్సీ జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ డిమాండ్ చేశారు. పార్వతీపురంలోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని, దీనిని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలతో పాటు పారిశుధ్య కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.రవికుమార్, అక్కినేని శ్రీనివాసరావు, దొగ్గ మోహన్, ఎం.కార్తీక్, జాగాన రవిశంకర్, గొంగాడ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా జీవో ఉపసంహరించుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగానికి సంబంధించిన జీవో ఉపసంహరించాలన్నారు.గిరిజన సంక్షేమసంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ కోరారు.ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ హక్కుల కోసం పోరాటం చేస్తున్న మునిసిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, సర్వశిక్షాఉద్యోగులపై ప్రభుత్వం తీరు సరిగాలేదని పేర్కొన్నారు.

రాముని అక్షింతల పంపిణీ

సాలూరు రూరల్: అయోధ్య శ్రీబాలరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని సాలూరు డబ్బి వీధి రామమందిరం వద్ద ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఆదివారం ప్రారంభించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, భద్రాద్రి రాముని కల్యాణ ముత్యంతో కలిపి ఇంటింటికి పంపిణీ చేశారు. శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపం అధ్యక్షుడు గౌడు రమణ, తదితరులు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం: అయోధ్యలోని శ్రీరాముని అక్షింతలు గుమ్మలక్ష్మీపురం చేరుకున్నాయని సర్పంచ్ గౌరీశంకర్ తెలిపారు ఈ మేరకు వాటిని ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశామని చెప్పారు.



అక్షింతలు, రాముడి చిత్రపటాలతో ర్యాలీచేస్తున్న భక్తులు

'రా.. కదలిరా'ను విజయవంతం చేయాలి



జియ్యమ్మవలస: మాట్లాడుతున్న పరిశీలకుడు పీవీజీ కుమార్



సాలూరు రూరల్:మాట్లాడుతున్న టీడీపీ నేత సంధ్యారాణి



కొమరాడ: మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వరి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఈనెల 10న టీడీపీ నిర్వహించనున్న రా.. కదలిరా.. సభకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఈసభకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి సుమారు లక్షమందిని తరలించేందుకు ఇన్‌చార్జిల పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం జిల్లాలో రా ..కదిలారా కార్యక్రమంపై సన్నాహక సమావేశాలు నిర్వహించారు. భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ● జియ్యమ్మవలస: బొబ్బిలి కేంద్రంలో ఈనెల 10న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు విచ్చేస్తున్న రా.. కదలిరా కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని పార్టీ పరిశీలకుడు పీవీజీ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం చినమేరంగి గ్రామంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు నివాసం వద్ద ఈ విషయమై కురుపాం నియోజకవర్గ స్థాయి సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పది వేల మందికి తక్కువ కాకుండా తీసుకెళ్లాల్సిన బాధ్యత మండల కన్వీనర్లు, పరిశీలకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల దేనన్నారు. దీనిపై మాజీ మంత్రి విజయరామరాజు మాట్లాడుతూ అంతకంటే ఎక్కువ ముందే తరలివస్తారన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి కె.వెంకటరమణ, జియ్యమ్మవలస మండలానికి సీహెచ్ మోహనరావు, గరు గుబిల్లి మండలానికి ఎన్.గోవిందరావులను పరిశీలకులుగా వేశారని చెప్పారు. ఈ పరిశీలకుందరికీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు డి.రామకృష్ణ, ఎంబీ విజయవాంకుశం, పి.సుధ, వెంపటాపు భారతి, మరడాన తవిటినాయుడు, పురుషోత్తం నాయుడు, పలువురు సర్పం చ్‌లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.● సీతానగరం: బొబ్బిలిలో ఈనెల 10న నిర్వహించనున్న రా.. కదలిరా.. కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని టీడీపీ మండల పరిశీలకుడు మాళ్ల సురేంద్ర కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఈ సమా వేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు మజ్జి అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎస్.రాంబాబు, జి.బాబ్జీ, సీనియర్ నాయకులు శేషగిరిరావు పాల్గొన్నారు. ● కొమరాడ: ఈనెల 10వ తేదీన రా.. కదలిరా కార్యక్రమానికి వస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి జగదీశ్వరి కోరారు. ఆదివారం శివినిలో జరిగిన పార్టీ ముఖ్య నాయ కులు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలం నుంచి వెయ్యి మందికి పైగా బొబ్బిలిలో జరిగే సభకు హాజరుకావాలని, అందుకు తగిన ఏర్పాట్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసుకోవాలని కోరారు. టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖరపాత్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమా వేశంలో పార్టీ నాయకులు డి.వెంకటినాయుడు, సుదర్శనరావు, మధుసూదనరావు, పి.వెంకటనాయుడు, వెంపటాపు భారతి పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: వైసీపీ పాలనలో సీఎం జగన్ రెడ్డి అస్తవ్యస్తం చేసిన రాష్ట్రాన్ని పునర్నిర్మించి, కాపాడే సామర్థ్యం టీడీపీ అధినేత చంద్ర బాబునాయుడుకే ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బొబ్బిలికి ఈనెల 10న రా కదలిరా కార్యక్రమానికి వస్తున్న చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి ఆదివారం ఆమె ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రా.. కదలిరా.. కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పరిశీలకులు విశ్వప్రసాద్, గవిరెడ్డి రామునాయుడు, పార్టీ నాయకులు ఆముదాల పరమేశు, పిన్నింటి ప్రసాద్, నిమ్మాది చిట్టి, అక్యాన తిరుపతిరావు, పెద్దింటి శ్రీరాములు, మజ్జి చిరంజీవి, శ్యాం, మండల పరిశీలకులు సీతారాం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిరండి

బొబ్బిలిలో ఈనెల 10న టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించనున్న రా.. కదలిరా.. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు జన సమీకరణకు విజయనగరం జిల్లాలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు.

భారీగా తరలిరండి

దత్తిరాజేరు: రా.. కదలిరా.. కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10న బొబ్బిలి వస్తున్నారని, ఈ పర్యటనను నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ గజపతినగరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడు పిలుపునిచ్చారు. పెదకాద గ్రామంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావే శంలో మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు ప్రతిఒక్కరూ స్వస్తి పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జిలు బెజవాడ బంగారునాయుడు, పెద్దంటి జగన్, మజ్జి మహేష్, పార్లమెంట్ కార్యదర్శి గుసిడి జగన్నాథం, చెల్లూరి సత్యరావు, కువైట్ రాము, పి.కేశవరావు, రామసత్యం, తాడ్డి రవి, మంత్రి చంటి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిపై బాధ్యత ఉంది

గంట్యాడ: బొబ్బిలిలో ఈనెల 10న రా.. కదిలి రా.. కార్యక్రమానికి విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం కేపీఎన్ బీఈడీ కళాశాలలో గంట్యాడ, జామి మండలాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రా.. కదలిరా కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు మాట్లా డుతూ గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పిలుపు నిచ్చారు. గజపతినగరం నియోజకవర్గం పరిశీలకుడు పాసర్ల ప్రసాద్, టీడీపీ నాయ కులు పి.శ్రీనివాసరావు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, గొల్లంగి ఆనంద్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, గోపాలరాజు, పోలిపర్తి స్వామినాయుడు, అట్టాడ లక్ష్మణరావు, రంధి చినరామునాయుడు, బూడి అప్పల నాయుడు, రొంగళి రమణమ్మ, కె.సూర్యారావు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

తెర్లాం: బొబ్బిలిలో ఈనెల 10న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నిర్వహించనున్న రా.. కదలిరా.. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీ నాయన పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుతో కలిసి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధినేతకు బొబ్బిలి నియోజకవర్గంలో ఘనస్వాగతం పలికేందుకు ప్రతిఒక్కరూ కదలిరావాలని కోరారు.సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి వెంకట నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సింహాచలం, మండల నాయకులు యుగంధర్, శంకరరావు, చేపేన శశిభూషణరావు, కార్యకర్తలు, గ్రామ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.● బాడంగి: స్థానిక తెంటు బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో బేబీనాయన మాట్లాడుతూ చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరారు. తెంటు లక్ష్మునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, కొల్లి అప్పలనాయుడు, పాలవలస గౌరు పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాల నుంచి హాజరు కావాలి

లక్కవరపుకోట: బొబ్బిలిలో ఈ నెల 10న చంద్రబాబు తలపెట్టిన 'రా...కదిలిరా' మహాసభకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు హాజరు కావాలని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి కోరారు. ఆదివారం ఆమె నెల్లిమర్ల నియోజకవర్గంలో కర్రోతు బంగార్రాజుతో కలిసి టీడీపీ నేతల సమావేశం నిర్వహించారు. లలితకుమారి నెల్లిమర్ల నియోజకవర్గ జనసమీకరణ ఇన్‌చార్జిగా నియమితులైనందున కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు సభను విజయవంతం చేయాలని, అందుకు జిల్లా నేతలంతా కష్టపడి పనిచేయాలని కోరారు. ఆమె సమక్షంలో నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో కేబీఏ రాంప్రసాద్, కె.విజయ్‌కుమార్, ఎ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలి

చీపురుపల్లి: బొబ్బిలిలో ఈనెల 10న జరగనున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభను ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పార్టీ నాయకులు బగ్గు రమణమూర్తి, గొంప కృష్ణలతో కలిసి ఆయన మాట్లాడారు. రా కదలి రా.. పేరుతో ఈనెల 10న బొబ్బిలిలో నిర్వహిస్తున్న చంద్రబాబు సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు విసిగిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, వెన్నె సన్యాసినాయుడు, టి.కిరణ్‌కుమార్, ముల్లు రమణ, సారేపాక సురేష్, తాడ్డి సన్యాసి నాయుడు, కెంగువ ధనుంజయ్, బలగం వెంకటరావు, వై.సత్యం, గవిడి నాగరాజు, మొగసాల రమేష్, ఆరతి సాహు, మహంతి అప్పలనాయుడు, వెంపడాపు లక్ష్మ నాయుడు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: బొబ్బిలిలో ఈనెల 10న జరుగనున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, మహంతి శంకరరావు, కర్రోతు సత్యనారాయణ, పార్టీ నాయకులు పతివాడ అప్పలనారాయణ, పసుపులేటి గోపి, ఆకిరి ప్రసాదరావు, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, పాణిరాజు, అట్టాడ శ్రీధర్, సత్యనారాయణ, బొంతు వెంకటరమణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారిగా జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: జిల్లా మలేరియా అధికారి (ఇన్‌చార్జి) టి.జగన్మోహనరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఆదివారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో వ్యాధి నిరోధక అధికారిగా సేవలు అందిస్తున్న ఆయనకు జిల్లా మలేరియా అధికారిగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పడం పట్ల పలువురు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి

జియ్యమ్మవలస:మండలంలో గిరిజన గ్రామాలకు బీటీరోడ్లు వేయాలని ఈనెల తొమ్మిదో తేదీన ఎంపీడీవో కార్యాలయాల వద్ద చేపట్టబోయే ధర్నాకు గిరిజనులందరూ హాజరై విజయవంతంచేయాలని వ్యవసాయ కార్మిక సంఘంనాయకులు కోరారు.ఆదివారం ద్రాక్షణి గ్రామంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహనరావు, గిరిజనులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో దివ్యజీవన సత్సంగం

పాలకొండ (వీరఘట్టం): వీరఘట్టంలోని శాంతి ఆశ్రమంలో కర్రి గోపన్న ఆధ్వ ర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిప్రతినిధి ఎన్‌వీరమణ మాట్లాడుతూ మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరాలంటే ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం చేయాలన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

పార్వతీపురంటౌన్: ఆరోగ్యమే మహా భాగ్యమని వాకర్స్ ఇంటర్నేషనల్ 101, 102 జిల్లాల గవర్నర్ స్వామి నాయుడు అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మోర్నిం గ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నడక, నడత అనే అంశంపై జరిగిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రతిఒక్కరూ నడవడంతో పాటు మరొకరిని నడిపించాలని తెలిపారు.

రాయగడలో ముగ్గుల పోటీలు



ఆర్‌జి నిర్వాహకులతో విజేతలు

రాయగడ: స్థానిక స్పందన సాహితీ సాంస్కృతిక సమాఖ్య సంక్రాంతి వేడుకలు పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. రామలింగేశ్వరాలయ ప్రాంగణంలో గల స్పందన కార్యాలయంలో మహిళలు సృజనాత్మకంగా ముగ్గులు వేశారు. మహిళలకు దీటుగా పోటీలో పాల్గొన్న యవకుడు సుజిత్ కొసల సంక్రాంతి సందేశం ఉట్టిపడేలా ముగ్గువేసి ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాడు.ద్వితయబహుమతి ఎస్.జ్యోతి,తృతీయబహుమతి జి.దుర్గా పింకిలు పొందగా పోత్సాహక బహు మతులను, టి.గౌరి,ప్రవల్లికలు అందుకున్నారు. న్యాయనిర్ణేతగా టి.శ్రీదేవి వ్యవ హరించారు.సంస్థ కార్యదర్శి పతివాడు తులసీదాస్ పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యదర్శి కొండవలస కృష్ణమూర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భళ్లమూడి నాగరాజు, లాడి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

శిష్టకరణాల సంక్షేమానికి కృషి చేయాలి

రాయగడ: శిష్టకరణాల సంక్షేమానిక కృషి చేయలని రాయగడ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.పట్నాయక్ తెలిపారు. స్థానిక రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ కుల బంధువుల ఐక్యతకు,సంక్షేమానికి సంఘం తరఫునసహకరించాలన్నారు.కార్యదర్శి మహేష్ పట్నాయక్ మాట్లాడుతూ కులబంధువులంతా సహకరించుకుని ముందుకు సాగుదామన్నారు. ఫిబ్రవరి నాలుగో తేదీన వనసమారాధన చేసేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రేమకుమార్ పట్నాయక్, సంయుక్త కార్యదర్శి సారథిపట్నాయక్, కోశాధికారి లక్ష్మీప్రసాద్ పట్నాయక్, సలహాదారు వి.రామ్మోహన్ పట్నాయక్ పాల్గొన్నారు.

గంజాయి తోటల ధ్వంసం

రాయగడ: జిల్లాలో సాగవుతున్న గంజాయిని ధ్వంసం చేసేందుకు పోలీసులు నిరంతరం ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పద్మాపూర్ సమితి పరిధి కిలింగ రాయ్‌మెట్ట గ్రామ అటవీ ప్రాంతంలో నాలుగెకరాల్లో సాగుచేస్తున్న గంజాయిని పోలీసులు ధ్వంసం చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రాయగడ: రాయగడలో ఆర్బీఐ భువనేశ్వర్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బిజూపట్నాయక్ ఆడిటోరియం వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఆర్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యబ్రత బారువా మాట్లాడుతూ ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసగాళ్ల బారిన పడకూడదని, విజ్ఞతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రొయిత్, జిల్లా కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ అధికారి నిహార్ రంజన్‌కహర్, ఎస్‌బీఐ చీఫ్ సెక్రటరీ దేవేంద్రకుమార్ బౌరి పాల్గొన్నారు.



పాలకొండ: జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



గుమ్మలక్ష్మీపురం: జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



మక్కువ: ఎస్మా చట్టం ప్రతులను దహనం చేస్తున్న కార్యకర్తలు

జీవో-2ను రద్దు చేయాలి

● ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు

● 27వ రోజుకు చేరిన సమ్మె

ఎస్మా ప్రయోగానికి సంబంధించి జారీచేసిన జీవో-2ను తక్షణమే రద్దుచేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-2 ద్వారా సమ్మెను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఇది ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆరోపించారు. కాగా అంగన్‌వాడీలుచేస్తున్న సమ్మె 27వ రోజుకు చేరింది.

-ఆంధ్రజ్యోతి బృందం



కురుపాం: ఎస్మా ఉత్తర్వులు దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సాలూరు రూరల్: ఎస్మా ప్రతులను దహనంచేస్తున్న సీపీఎం నాయకులు

కాణిపూరి బందలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బొబ్బిలి: బొబ్బిలిలోని మల్లమ్మపేట రెవెన్యూ పరిధిలో సర్వేనెంబరు 242-6లో గల కాణిపూరి బందలో ఆక్రమణలకు పాల్పడితే శిక్షార్హులవుతారని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.ఈ బందలో ఆ క్రమణలు జరిపి పునాదులు నిర్మిస్తున్నట్లు వీఆర్వో ద్వారా సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ స్పందించారు. ఆర్ఐ కళ్యాణ చ క్రవర్తిని, వీఆర్వోను పంపించి ఆ చెరువులో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కాణిపూరి బంద ప్రభుత్వానికి చెందినదని, ఎవరైనా క్రయవిక్రయాలు జరిపితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ భూమిని ఎవరైనా రిజి స్ట్రేషన్ ద్వారా లావాదేవీలు జరుపుకుంటే మోసానికి గురైనట్టేనని తెలిపారు. అ క్రమ లావాదేవీలకు పాల్పడితే చట్టరీత్యా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వసతిగృహం పరిశీలన

గుర్ల: కలవచర్లలోని బాలుర వసతి గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం ఉదయం సందర్శించారు. విద్యార్థులకు అం దుతున్న సదుపాయాలు, సేవలపై ఆరా తీశారు. ఆహార పదార్థాలు రుచి చూసి, నిల్వ ఉన్న సరుకులను పరిశీ లించారు. ఆయన వెంట వసతి గృహ అధికారి కన్నంనాయు డు ఉన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చీపురుపల్లి: చీపురుపల్లిలో ఈనెల 9న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు క్లబ్ ప్రతినిధులు ఎస్వీజీ శ్రీనివాసరావు, ఎస్.సన్యాసిరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసాయి సూపర్‌స్పెషాలటీ ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

కోడి పందాలపై దాడి

గంట్యాడ:జగ్గాపురం శివారులో కోడి పందాలు ఆడుతున్న వారిపై గంట్యాడ ఎస్ఐ కిల్లారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. దాడిలో ఎనిమిది మందికి పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12,920 సీజ్‌చేసి, ఐదు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా సావిత్రిబాయి జయంత్యుత్సవాలు

బొబ్బిలి: ప్రతి ఏటా జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి రోజున జాతీయ మహిళాదినోత్సవంగా ప్రకటించాలని ఉపాధ్యాయినులు డిమాం డ్‌చేశారు. బొబ్బిలిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పూలే జయంత్యుత్సవాలను నిర్వహిచారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు విజయగౌరి మాట్లాడుతూ సమాజంలో అణగారిన, నిమ్న జాతులవారికి అక్షరజ్ఞానం అందివ్వాలని ప్రాణాలకు తెగించి కంకణం కట్టు కున్న పూలే ఆశయాలను సాధించేందుకు ఉపాధ్యాయినులు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

- వైసీపీనుంచి క్యూ కడుతున్న శ్రేణులు
- జగన్ ప్రజల విశ్వాసం కోల్పోయారు: టీడీపీ నాయకులు



రేగిడి: పార్టీ కండువాలు వేస్తున్న కోండ్రు



గుర్ల: కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన దృశ్యం



డెంకాడ: జొన్నాడలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీలోకి చేరికలు పెరుగుతూ వస్తున్నాయి. వైసీపీని వీడి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కొన్ని వందల సంఖ్యలో కుటుంబాలు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నాయి.

రేగిడి: మండలంలోని పనసలవలస సర్పంచ్ కడగల ధనలక్ష్మి, ప్రతినిధి గోవిందరావు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో 250 కుటుంబాలు రాజాం నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కోండ్రు మాట్లాడుతూ జగన్ సర్కారు ప్రజలు విశ్వాసం కోల్పోయిందని ఆరోపించారు. సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ జగన్ చర్యలతో విరక్తిచెంది వైసీపీని వీడామన్నారు. అనంతరం పార్టీలోచేరిన సర్పంచ్ ధనలక్ష్మి, ప్రతినిధి గోవిందరావు, ఉపసర్పంచ్ కడగల సింహాచలం, మాజీ సర్పంచ్ కడగల అప్పలనాయుడు, వార్డు సభ్యులతోపాటు పలుకుటుంబాలకు చెందిన కడగల బోడినాయుడు, మంతిన సూర్యనారాయణ, మంతిన చిన సత్యం, ఎం.శ్రీదేవిలను పార్టీ కండువాలువేసి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, మజ్జి శ్రీనివాసరావు, మంతిన ఉషారాణి, గురువాన నారాయణరావు, బాలమురళి, వి.నాగభూషణరావు, కర్ణేన మహేష్, గురువాన ధనంజయ్, గురవాన రమేష్, పాలూరి రామినాయుడు పాల్గొన్నారు.

గుర్ల: మంత్రి బొత్స సత్యనారాయణ ఇలాకా చీపురుపల్లిలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి రోజురోజుకు చేరికల సంఖ్య పెరుగుతోంది. తాజాగా మండలంలోని గూడెం గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి ఆదివారం టీడీపీలో చేరాయి. టీడీపీలోకి వచ్చినవారిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా గ్రామంలో ఏర్పాటుచేసిన టీడీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నాగార్జున మాట్లాడుతూ బొత్స చీపురుపల్లి నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు ఏమి చేయలేదన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, టి.కిరణ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు మహేష్, మండల ప్రధాన కార్యదర్శి పిల్ల అప్పలనాయుడు, గూడెం గ్రామ నాయకులు రెడ్డి సూర్యనారాయణ, దవల రమణ, తోట పైడినాయుడు, రౌతు రమణ, రెడ్డి శ్రీను, పోలినాయుడు, ముసలినాయుడు, రామారావు, అక్కునాయుడుతోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంకాడ: జొన్నాడ పంచాయతీకి చెందిన 50మంది వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీలో చేరారు. టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీ విసినిగిరి అప్పలనాయుడు, మాజీ ఉప సర్పంచ్ పాపినాయుడు, వారి అనుచరులు సుమారు 50మంది తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డెంకాడ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాణిరాజు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పతివాడ విద్యాసాగర్‌నాయుడు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయి: బొత్స

విజయనగరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీలు సంక్షేమంపై రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం విజయనగరంలోని కనపాకలో వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 11 డిమాండ్లలలో ఒక్కటి మినహా అన్నింటినీ పరిష్కరించామన్నారు. ఒక్క డిమాండ్ విషయంలో ఎన్నికల తరువాత పరిష్కరిస్తామని వెల్లడించినప్పటికీ వినటం లేదన్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఎస్మా చట్టం ప్రయోగించినపుడు చట్టం తన పని తాను చేస్తుందన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. అంగన్‌వాడీలు, కార్మికులు ఇలా నిరసన కార్యక్రమాలను కమ్యూనిస్టు పార్టీలు వెనుకుండి నడిపిస్తున్నాయన్న కారణంగా బొత్స వారిపై వాఖ్యలు చేయటం గమనార్హం.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలోని ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసరాలు, 42 మందికి సంక్రాంతి పండగ సందర్భంగా వస్త్రాలను అందజేశారు. కొత్తవలస డిప్యూటీ తహసీల్దార్ రమేష్, విజయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అధినేత శానాపతి సత్యనారాయణ మూర్తి, గోపి, ట్రస్టు సభ్యుల సహకారంతో అందచేసినట్టు ట్రస్టు చైర్మన్ విధ్వనాథ హరికుమార్ తెలిపారు.

'సంపూర్ణ కవితా సంకలనం' ఆవిష్కరణ

రాజాం: రాజాంలో ఆదివారం రాజాం రచయితల వేదిక సమావేశం (రారావే) నిర్వహించారు. ఈ సందర్భంగా బొద్దూరుకు చెందిన బంటుపల్లి గౌరు నాయుడు రచించిన సంపూర్ణ కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు.ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గార రంగనాధం, రాజాపు శాంతా రావు, మూడడ్ల శ్రీనివాసరావు, పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు, సమతం మహేశ్వరరావు పాల్గొన్నారు

ఐబీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం రూరల్: ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ (ఏఐబీఈఏ) క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఉన్న అమర్‌భవన్‌లో జరిగింది. బ్యాంకింగ్ రంగం పరిరక్షణ, బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాతీయ, రాష్ట్రశాఖల పిలుపుమేరకు గత ఏడాది ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, ఈ ఏడాది కూడా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. బ్యాంకు ఉద్యోగులంతా సహకరించాలని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి మురళీశ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎఐబీఈఏ నాయకులు శ్రావణ్‌నాయక్, శ్రీనివాసరావు, చిన్నారావు, హరీష్, మనోజ్ వర్మ, రవికుమార్, భానోజీరావుతో పాల్గొన్నారు.

13న వాజీ రంగోలి పోటీలు

విజయనగరం దాసన్నపేట: సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాజీ చానల్ ఈ నెల 13న రంగోలి పోటీలు నిర్వహిస్తున్నట్టు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఆసుపత్రి ఎండీ రమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల్లో అంతర్లీనంగా ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీసుకువచ్చేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మధు, కేఆర్‌కే రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా లక్ష్మణమూర్తి

కలెక్టరేట్: జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా ఎస్‌వీ లక్ష్మణమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్‌గా పని చేసి వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు ఏపీసీగా నియమించారు. గతంలో ఇక్కడ ఏపీసీగా పని చేసిన వేమలి స్వామినాయుడు తన మాతృసంస్థకు బదిలీపై వెళ్లడంతో ఆయా ఇన్‌చార్జి బాధ్యతలను డీఈవో లింగేశ్వరెడ్డికి అప్పగించారు. ఇప్పుడు ఏపీసీగా లక్ష్మణమూర్తిని నియమించారు.

తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విజయనగరం దాసన్నపేట: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్టణంలోని లయన్సు క్లబ్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా నమ్మి శ్రీనివాసరావు వ్యవహరించగా, అసోసియేషన్ నుంచి ఎంవీ మాణిక్యాలరావు, శ్రీహరి, పరిశీలకులుగా హాజరయ్యారు. వేణుగోపాలరావును జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గురాన అయ్యలు, క్రీడా సంఘాలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేలు

తెర్లాం: చిన్నతం నుంచే పిల్లలు పుస్తక పఠనంను అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కథన పుస్తకాలు, పురాన, ఇతిహాసాల గ్రంథాల్లోని ముఖ్యంశాలను చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

పారిశుధ్య పనులు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్ దుల్ల లక్ష్మి సారధ్యంలో పంచాయతీ కార్యదర్శి యశోధ పర్యవేక్షణలో ఈ పనులు చేపడుతున్నారు. కాలువులలో పేరిక పోయిన చెత్తా చెదారాలను తీయించారు.

చంద్రబాబు వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

శృంగవరపుకోట, జనవరి 7: ఇప్పటికే అన్ని విధాలా నష్టపోయిన ప్రతి వర్గం భవిష్యత్తు బంగారంగా మారాలంటే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎస్సీ కాలనీలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిస్తే అమలు చేయబోయే హామీలు వివరించారు. కార్యక్రమంలో జీఎస్ నాయుడు, కొణదం మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, కాపుగంటి వాసు, చెక్క కిరణ్, అనకాపల్లి చెలయ్య, బర్మాకాలనీ సాయిరాం ఉన్నారు.



బర్మాకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న లలితకుమారి

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

రామభద్రపురం: రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని శిష్టు సీతారాంపురంలో ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ఈ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. ప్రజలు నిత్యవసర ధరలు, విద్యుత్ చార్జీలతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ సమస్య ఎక్కువైందని, దీంతో యువత ఉపాధి లేక అల్లాడిపోతున్నారన్నారు. ఈ రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలోకి రావాలంటే అనుభవజ్ఞులైన చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇప్పటినుంచే టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.

ఆంజనేయ స్వామి శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

విజయగనరం (ఆంధ్రజ్యోతి), జనవరి 7: నగరంలోని తోటపాలెం బాలాజీ నగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం హనుమ వాహనంపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి శోభాయాత్రను దేవాలయం నుంచి ఘనంగా నిర్వహించారు. ఈ యాత్ర బాలాజీ నగర్ పురవీధులు, శ్రీనివాస కళాశాల, న్యూ సెంట్రల్ స్కూల్, తోటపాలెం రామాలయం, ముత్యాలమ్మ గుడి మీదుగా దేవాలయానికి చేరుకుంది. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని 1,008 సామూహిక హనుమాన్ చాలీసా పారాయణలు పూర్తి చేసుకుని ఈ శోభాయాత్ర చేశారు. ఈ శోభాయాత్రలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, ఫోటోలు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా జీవో కాపీల దహనం



బొబ్బిలిలో ఎస్మా జీవో కాపీలను దహనం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి, జనవరి 7: అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ జీవో జారీ చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక పాకీ వీధిలో అంబేడ్కర్ విగ్రహం ముందు జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు పి.శంకరరావు ఆధ్వర్యంలో జీవో 2 కాపీలను ఆదివారం దగ్ధం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ఎంతమాత్రం సబబు కాదన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలన్నిటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే పోరాటం ఉధృతమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.గౌరీశ్, యుగంధర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్

రాజాం: బొబ్బిలిలో ఈనెల 10న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొనే బహిరంగ సభను విజయవంతంచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 20 వేలకుపైగా రా కదిలిరా సభకు తరలిరావాలని కోరారు. నియోజ కవర్గం పరిధిలోని నాలుగు మండలాల నుంచి పరిశీలకులను పార్టీ నియమించిందన్నారు. రాజాం మండలం, రాజాం టౌన్, రూరల్, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలకు గండిబాబ్జీ, పీఎంజే బాబు, కోరాడ హరిగోపాల్, కలగ జగదీష్‌యాదవ్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పటణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, పిస్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, పొట్టా చిట్టిబాబు, టంకాల కన్నంనాయుడు, వల్లూరు గణేష్, ఎల్.ధనలక్ష్మి, మంతిన ఉషారాణి, ఎస్ .రమేష్‌కుమార్, జె.నీలయ్య, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు, గురవాన రమేష్, బి.రవి, ఎం.శ్రీను పాల్గొన్నారు.

వైసీపీకి బొబ్బిలిలో అభ్యర్థి కరువు

బాడంగి, జనవరి 7: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ గల్లంతు కావడం ఖాయమని కొప్పలవెలమ బీసీ సాధికారిత విజయనగరం పార్లమెంటరీ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన బాడంగిలో విలేఖర్లతో మాట్లాడుతూ బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు వైసీపీ అభ్యర్థులను వెతుక్కుంటుందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, టీడీపీ తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు. బొబ్బిలిలో ఈ నెల 10వ తేదీన జరగనున్న 'రా...కదలిరా' బహిరంగ సభతో వైసీపీ నేతల్లో భయం మొదలవుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కుల వృత్తులు కనుమరుగయ్యాయని, టీడీపీ హయాంలోనే కులవృత్తులకు న్యాయం జరుగుతుందన్నారు. లచ్చుపతుల సత్యం, ఇప్పిలి రమేష్, కొల్లి సత్యారావు, కొల్లి జగన్నాథం, కొల్లి చిన్నంనాయుడు, తెంటు సత్యారావు, మత్స త్రినాధ, లచ్చుపతుల ఈశ్వరరావు, అలజంగి పుష్పనాథం, భోగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ



జామిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమరసత ఫౌండేషన్

జామి: జామిలో సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ ర్యాలీగా వెళ్లి అందించారు. కార్యక్రమంలో కాళ్ల నాగభూషణం, దనియాల పైడి రాజు, బోడసింగి అప్పలరాజు తదితరులున్నారు.


ఏపీసీపీఎస్ఈఏ కార్యవర్గం ఎన్నిక

రాజాం: ఏపీసీపీఎస్ఈఏ మండల కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా బూరాడ పెంటన్నా యుడు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, మహిళా అధ్యక్షురా లిగా సౌజన్య, మహిళాకార్యదర్శులుగా రుప్పా నాగమణి, గొర్లె రుద్రాణి, దిలీప్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా దూబ త్రినాథరావు, అదనపు కార్యదర్శులుగా సాకేటి సూర్యనారాయణ. ఎస్.అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా వీవీ రమణ, ఎంవీ సూరపునా యుడు, పిట్ట నగేష్, ఎస్.కోటీశ్వరరావు, జె.రామకృష్ణ, ఎస్. రాజశేఖర్, పల్లి సింహాచలం, ఆర్థిక కార్యదర్శులుగా పి .పార్వతీశం ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గ క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండికి టిక్కెట్ ఇవ్వొద్దు

- వైవీ సుబ్బారెడ్డికి తేల్చి చెప్పిన ఐదు మండలాల నాయకులు

శృంగవరపుకోట/కొత్తవలస,(విజయనగరం-ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గ వైసీపీలో విభేదాలు ఊపందుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు మళ్లీ టిక్కెట్ ఇవ్వొద్దంటూ గట్టిగానే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం కొత్తవలస, వేపాడ, శృంగ వరపుకోట మండలాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు విశాఖపట్టణంలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి శృంగవరపుకోట శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇవ్వద్దొంటూ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి లిఖితంగా పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొత్తవలస మండలం నుంచి వివిధ రకాల వాహనాల్లో వైవీ సుబ్బారెడ్డి ఇంటికి చేరుకున్నారు. వీరంతా ముక్త కంఠంతో కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే సహకరించమని తెల్చిచెప్పారు. అయితే వీరందరి మాటలను విన్న వైవీ సుబ్బారెడ్డి అధినేత జగన్ దృష్టిలో పెడతానని చెప్పి పంపించేశారు. ఏడాది కాలంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు మధ్య పొసగడం లేదు. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని రఘురాజు అడుగుతున్నారు. లేకుంటే స్థానికంగా ఉన్న నేతలకు ఎవరికి టిక్కెట్ కేటాయించిన గెలిపించుకుంటామని చెబుతున్నారు. గత వారం రోజులుగా రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెక్కల నాయుడు బాబు టిక్కెట్ కోసం అడుగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే పని చేయమని ఖరాఖండిగా చేప్పేశారు. శృంగవరపుకోట ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, వేపాడ వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ముత్యాలమ్మ, నెడ్‌కేప్ డైరెక్టర్ పద్మ, మెరపల సత్యనారాయణ, దుల్ల వెంకట రావు, కొత్తవలస మండలం నుంచి మేళాస్త్రీ అప్పారావు తదితరులు కార్యకర్తలతో కలిసి వెళ్లారు. విజయనగరంలో రేపు బొత్స సత్యనారాయణను కలువనున్నామని రఘు రాజు తెలిపారు.



వైవీని కలిసిన నాయకులు

- ఎస్‌కోట నియోజకవర్గంలో ఎప్పటికపుడు అసమ్మతి బావుటా ఎగరేస్తున్న అక్కడి సర్పంచులు, ఎంపీపీలు, ఎంటీసీలు, జడ్పీటీసీలు, నాయకులు ఈ సారి మంత్రి సత్తిబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చేందుకు సన్నద్ధం అయ్యారు. గత కొన్నాళ్లగా ఎమ్మెల్యేపై అసమ్మతిని వెళ్లగక్కుతున్న నాయకులు చాలా సార్లు జిల్లా పార్టీ సమన్వయకర్త, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వద్ద మొర పెట్టుకున్నారు. ఇటీవల కొత్తవలస మండలంలో ఎమ్మెల్సీ రఘురాజుతో ఆత్మీయ సమావేశాన్ని ఆ మండల నాయకులు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే కడుబండిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సారి జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను నియోజవర్గ నాయకులంతా కలిసి ఎమ్మెల్యేపై తమకున్న అసంతృప్తిని వ్యక్తం చేయ నున్నారు. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టు కటుబండికి ఇవ్వకుండా చూడాలని కోరునున్నట్లు సమాచారం.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కలెక్టరేట్, జనవరి 7: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సమ్మెను కొనసాగిస్తున్నారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను చిన్న చూపు చూడడం తగదన్నారు. సమస్యలపై పోరాటం చేస్తున్నవారి గొంతు నొక్కడం సరికాదన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, బకాయిలు చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీకి జీతాలు అందించాలని, పార్ట్ టైం విధానాన్ని పూర్తిగా రద్దు చేసి కాంట్రాక్ట్ విధానంగా మార్పు చేసి సర్వీసు నిబంధనలను రూపొందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పందెంరాయుళ్ల అరెస్టు

- రూ.31,260 నగదు, 15 కోడి పుంజులు స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని వాకాడవలస గ్రామ శివారులో అమ్మవారి గుడి దగ్గర ఆదివారం సాయంత్రం కోడిపందెం శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. స్పెషల్ బ్రాంచి హెడ్‌కానిస్టేబుల్ కె.చిన్నారావు ఇతర సిబ్బంది అందించిన సమాచారం మేరకు ఎస్ఐ వి.జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో పందెంరాయుళ్లను, కోళ్లను గుర్తించి పట్టుకున్నారు. కోళ్లకు కత్తులు కట్టి, డబ్బులు పెట్టి ఆడుతుండగా పటుబడ్డ 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 31,260 నగదు, 15 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న షాపుపై దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని వల్లంపూడి ఎఎస్ఐ టీవీ రమణ తెలిపారు. నిందితుడైన కొండగంగుబూడి గ్రామానికి చెందిన సిద్దనరాతి ఈశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు.

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం, చిన్నిపాలెం గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 116 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. దేశపాత్రుపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తి నుంచి 100 సీసాలను, చిన్నిపాలెంలో ఒకరి వద్ద 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

రేగిడి: మండలంలో తునివాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనధికారికంగా తీసుకువెళ్తున్న 25 మద్యం సీసాలను ఆదివారం ఉంగరాడమెట్ట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాజాం రూరల్: మండలంలోని గడిముడిదాం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం సీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోని బచ్చెంపేటకు చెందిన కోరాడ సత్యం వీటిని అధిక ధరలకు అమ్మడానికి తీసుకువెళ్తున్న విషయం తెలుసుకుని ఆయన్ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. కాగా తరచూ మద్యం బాటిళ్లు పట్టుబడడం వెనుక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం 100 బాటిళ్లు పట్టుబడగా, ఈనెల 5న రెండు ప్రాంతాల్లో 44 బాటిళ్లు, 6న 18 బాటిళ్లు పోలీసులు దాడుల్లో పట్టుబడ్డాయి. ఈమొత్తం వ్యవహారం వెనుక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రంథాలయాన్ని బాగుచేసి అప్పగించాలి

- జనసేన నేత పాలూరు బాబు హెచ్చరిక

బొబ్బిలి, జనవరి 7: బొబ్బిలి పట్టణంలో పాడుబడ్డ మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ గ్రంథాలయాన్ని తక్షణం బాగు చేసి తిరిగి ఈ నెల 24 లోగా అప్పగించాలని, లేకుంటే చదువరులతో కలిసి జనసేన పార్టీ నిరాహార దీక్ష చేపడుతుందని ఆ పార్టీ నేత పాలూరు బాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రంథాలయం భవనం పాడై పోయినందున రెండు వారాల్లోగా బాగు చేయించి అప్పగిస్తామని నమ్మబలికి దానిని ఖాళీ చేయించారన్నారు. ఇప్పుడు నెలలు దాటుతున్నా దానికి అతీగతీ లేకుండా పోయింద న్నారు. హామీ ఇచ్చిన అధికారులు దాని గురించి పూర్తిగా పట్టించుకోవడం మానేసారన్నారు. పోటీ పరీక్షలకు హాజరవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు, ఇతర పాఠకులు తీ వ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. గతంలో తాము ఆందోళన చేసిన తరువాత గ్రంథాలయాన్ని ఖాళీ చేయించి మరమ్మతు పనులు చేస్తున్నట్లు నటించారన్నారు. ఇసుమంత మర మ్మతు పనులైనా అక్కడ జరగలేదన్నారు. పలువురు దాతలు ముందుకొచ్చి గ్రంథాలయం అవసరాలను తీర్చుతున్నారని అయినా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటని అన్నారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమీషనరులు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది నిర్లక్ష్యమా? లేక చేతకాని తనమా? అని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 24 లోగా గ్రంథాలయాన్ని పూర్తి మరమ్మతులు, సౌకర్యాలతో విద్యార్థులకు, పాఠకులకు అప్పగించాలని లేకుంటే జనసేన తరఫున నిరాహార దీక్ష చేపడతామని బాబు హెచ్చరించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

బొబ్బిలి, జనవరి 7: ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల వారికి బకాయి పడ్డ 32 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా నేత జేసీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో ఆదివారం జిల్లా ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 187 నెలల కరవు భత్యం బకాయిలు 15 వేల కోట్లు, పీఎఫ్, సరెండర్ లీవు, ఏపీజీఎల్ఐ తదితర బకాయిలు 17 వేల కోట్లు చెల్లించాలని ఆయన అన్నారు. పీఎఫ్ సొమ్మును చెల్లించకపోవడంతో అత్యవసర కుటుంబ అవసరాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల వారు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయకపోతే పోరాటం తప్పదని అన్నారు. జోగినాయుడు మాట్లాడుతూ 24 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం నిరంకుశమన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. అత్యవసర సర్వీసుల విభాగంగా గుర్తించినప్పుడు వారికి రావాల్సిన న్యాయమైన చెల్లింపులు కూడా ఇవ్వాలన్నారు. విద్యారంగానికి సంబంధించిన అనేక సమస్యలను ఈ సమావేశంలో చర్చించారు. ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, భక్తదర్శనం, శ్రీను, సింహాచలం, ఎల్లయ్య, పరిశినాయుడు, పీటర్, రాములు పాల్గొన్నారు.

భారత్ దివ్యాంగ పార్టీ సంయుక్త కార్యదర్శిగా 'కోలా'

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామానికి చెందిన దివ్యాంగుల సంఘం నాయకుడు కోలా మధు నూతనంగా ఏర్పాటైన భారత్ దివ్యాంగ పార్టీకి సంయుక్త కార్యదర్శిగా నియమించారు. విజయవాడలో స్థానిక స్వతంత్ర సమర యోధుల భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా పార్టీని ఏర్పాటు చేశారు. ఈ పార్టీకి కోలా మధును సంయుక్త కార్యదర్శిగా నియామకం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మధు విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే ప్రత్యేక సమావేశానికి అన్ని జిల్లాల నుంచి దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై దివ్యాంగులకు చట్ట సభల్లో స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే భారత్ దివ్యాంగ పార్టీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నూతన పార్టీకి అధ్యక్షుడిగా కొనతం చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. సంయుక్త కార్యదర్శిగా తనను నియామకం చేశారని, ఉత్తరాంధ్రలో భారత్ దివ్యాంగ పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని మధు తెలిపారు.

ఆంగ్ల భాష పాఠ్యాంశాలపై పోటీలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బొబ్బిలి, జనవరి 7: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో రాష్ట్ర ఆంగ్లభాషోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఆంగ్లభాష పాఠ్యాంశాలపై ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మింది విజయమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోటీ పరీక్షలకు హాజరవుతుండాలన్నారు. ఎప్పటికప్పుడు తమ ప్రతిభను పరీక్షించుకుంటూ మరింతగా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆంగ్లభాషపై పట్టు సాధిస్తే ప్రపంచస్థాయిలో ఎక్కడైనా సునాయాసంగా మనుగడ సాధించవచ్చని ఆమె హితవు పలికారు.

- విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 232 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. వీరిలో బి.దుర్గా ప్రసాద్, అల్లు అశోక్ (పాల్తేరు జెడ్‌పీహెచ్‌ఎస్), జి.విశాలాక్షి (కొత్తూరు), బి.ఉపేంద్ర, జి.నవీన్ (బీజేపురం), వి.కుసుమలత (సాలూరు)లు విజేతలుగా నిలవడంతో వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో డెల్టా ప్రతినిధులు కర్రి సత్యనారాయణ, గుంపస్వామి, బీహెచ్ గంగాధర్, అప్పలనాయుడు, పళ్ల సత్యనారాయణ, సుగుణ, కళ్యాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనాన్ని బాగుచేయండి

రామభద్రపురం, జనవరి 7: మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. 1980 సంవత్సరంలో నిర్మించిన ఈ వసతి గృహంలో 3నుంచి పదో తరగతి వరకు 57 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారు 8 గదులు ఉన్నప్పటికీ ఇవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం, భవనం పైకప్పు పెచ్చులు కూడా ఊడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సుమారు 44 సంవత్సరాల కిందట నిర్మించిన ఈ భవనాలు పూర్తిగా పాడైపోయాయి. బాత్‌రూంల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో నాడు, నేడు కార్యక్రమం ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ భవనాలకు ఈ కార్యక్రమం ప్రవేశపెట్టలేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ హాస్టల్ దుస్థితిని దృష్టిలోపెట్టుకొని మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.